




## నెలనెలా నవ్వుల పండగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకటకృష్ణమూర్తి**

# వింతపాలెం!

**కారులో** తిరుపతి వెళ్తున్న ఒకతను దారిలో ఓ చిన్నపల్లెలో ఆగాడు.

" ఈ వూరు పేరేమిటి?" అడిగాడా కారు యజమాని ఒకర్ని.

"వింతపాలెం.." జవాబు చెప్పాడా వూరతను. అతని గొంతు అచ్చం ఆడగొంతులా వుంది.

"వింతపాలెం? పేరు తమాషాగా వుందే? ఈ వూరికా పేరెలా వచ్చింది?" ఆసక్తిగా ప్రశ్నించాడా కారు యజమాని.

"నాకు తెలీదు మా ఆవిడకి తెలుసేమో కనుక్కుంటానుండండి" అని తన ఇంట్లోకి వినపడేలా ఇలా అరిచాడు అతను.

"ఇదిగో! నిన్నే. మన వూరికి ఆ పేరెలా వచ్చింది?"

"నాకు తెలీదండీ.." లోపలనుంచి ఓ మగగొంతు జవాబు చెప్పింది.

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"మా ఆవిడకు నేనంటే ఎంతో శ్రద్ధ. ఉదాహరణకి మా ఇంటికి వచ్చిన అతిథులు తిరిగి వెళ్ళగానే 'వేడినీళ్ళు పెట్టు' అని ఆర్డరిస్తాను. వెంటనే వేణ్ణీళ్ళు పెట్టేస్తుంది మా ఆవిడ" గొప్పగా చెబుతూ అన్నాడు సుబ్బారావు తన స్నేహితుదు శ్యామలరావుతో.

"మంచిదేకాని వేడినీళ్ళెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు శ్యామలరావ్.

"ఎందుకేమిటీ? అంట్లు తోమడానికి. చన్నీళ్ళతో అంట్లు అంత బాగా శుభ్రం కావు."

❦❦❦

ఓ తాగుబోతు చేతిలో బట్టలు పట్టుకుని నగ్నంగా బీచ్‌లో తూలుతూ నడుస్తున్నాడు. అది చూసిన ఓ పోలీసు "అదేమిటి? దుస్తుల్లేకుండా తిరగడం నేరం అని తెలీదా నీకు?" అని గద్దించాడా తాగుబోతును.

"మరేం చేయను? బీచ్‌లో ఇంతమంది మనుషులు తిరుగుతుండగా వాళ్ళందరి యెదుట దుస్తులెలా వేసుకోవాలి? అందుకే ఏదయినా చాటు దొరుకుతుందేమోనని వెదుకుతున్నాను" అన్నాడా పెద్దమనిషి

❦❦❦

"ఓ మనిషి ఏభై రూపాయల బాకీ ఉంటే అది అప్పు. యాభై వేల రూపాయలు బాకీ ఉంటే దాన్ని వ్యాపారం అంటాం. యాభై లక్షల రూపాయలు బాకీ ఉంటే అదో పెద్ద పరిశ్రమ" వివరిస్తున్నాడో ప్రొఫెసర్.

"మరి యాభై కోట్లు బాకీ పడితే..?" ప్రశ్నించాడో విద్యార్థి.

"అప్పుడు దాన్ని ప్రభుత్వం అంటాం."

❦❦❦

"ఈ దొంగతనం ఎవరు చేశారో నాకు తెలుసు" అన్నాడు పోలీసు.

"ఎవరు చేశారు?" ఆత్రంగా అడిగాడు సొమ్ములు పోగొట్టుకున్న వ్యక్తి.

"నా పేరు ఎక్కడా అనొద్దు మరి."

"అబ్బే.. ఎవరితోనూ చెప్పను."

"ఈ దొంగతనం ఎవడో దొంగవెధవ చేసుంటాడు" ఆసామి చెవిలో నెమ్మదిగా చెప్పాడు పోలీసు.

❦❦❦

క్లాసులోని పిల్లలంతా జలుబుతో బాధపడటం గమనించిన టీచరు వాళ్ళకు పాఠం నేర్పాలనుకున్నాడు.

"గత వారం మా అక్కయ్య కొడుకు ఉదయాన్నే లేచి బయట చలికాలపు మంచులో తన మూడు చక్రాల సైకిల్‌తో షికార్లు మొదలెట్టాడు. అంతే. రెండోరోజు న్యుమోనియా వచ్చింది. మూడో రోజు చనిపోయాడు."

క్లాసంతా నిశ్శబ్దం అయింది. తన మాటల చాతుర్యం వాళ్ళమీద చూపిన ప్రభావానికి టీచరు సంతోషిస్తుండగా వెనక బెంచీలోంచి లేచి నిల్చున్న ఓ కుర్రాడిలా అడిగాడు –

"మరిప్పుడు ఆ మూడు చక్రాల సైకిలిని ఎవరు తొక్కుతున్నారు? ఖాళీగా ఉంటే ఎంతకు అమ్ముదామనుకుంటున్నారు?"

❦❦❦

"రాత్రి మీరెళ్ళిన సినిమాలో శృంగారం శృతిమించిందటగా?"

"ఏమో మరి నేను ముందు వరుసలో కూర్చున్నానాయె. మిగతా ప్రేక్షకులు ఏం చేస్తున్నారో నాకు కనిపించదుగదా!"

❦❦❦

"సార్! నాకు మీ అమ్మాయి చెయ్యి కావాలి. ఆవిడ చేయందుకుని నా జీవిత పథాన్ని తీర్చిదిద్దుకోవాలనుకుంటున్నాను" అన్నాడో యువకుడైన భావకవి తన ప్రియురాలి తండ్రితో.

"కోరుకునేవాడివైతే పూర్తి శరీరాన్ని కోరుకో కాళ్ళూ, చేతులు కావాలంటే ఎలా వీలవుతుంది?"

"నువ్వు వేసిన పులిబొమ్మ బాగానే వుంది. కానీ దానికి కళ్ళజోడెందుకు తగిలించావ్?" అంది తల్లి.

"అది మా లెక్కల మాస్టారు కాబట్టి" చెప్పాడు పుత్రరత్నం.

"రామూ మీ నాన్న ఏం చేస్తాడు?"

"వైద్యం చేస్తాడు సార్"

"రవీ మీ నాన్న?"

"లాయర్ సార్"

"రాజూ మరి మీ నాన్న ఏం చేస్తాడు?

"మా అమ్మ చెప్పింది చేస్తుంటాడు. "

"మీ ఇంట్లో గడియారం లేదుగా టైమెలా తెలుస్తుందే?" యింటికొచ్చిన స్నేహితురాలు మీనాక్షి కామాక్షిని ప్రశ్నించింది.

“ఓ...అదా" అంటూ ఓ రాగం అందుకుంది కామాక్షి.

వెంటనే పక్కింట్లోంచి "ఏవమ్మా ఇంకా పడుకోలేదా?రాత్రి పదయినా?" అంది బామ్మగారు.

"చూశావా? నాకు టైమెలా తెలుస్తుందో" అన్నట్లు మిత్రురాల్ని చూసి నవ్వింది కామాక్షి.

★★★

"మీరు నటించిన చిత్రం మూలంగా ఎంతోమంది ప్రేక్షకుల్ని చావునుండి రక్షించారు."

"అదెలా?"

"నిన్నరాత్రి షో జరుగుతుండగా సీలింగ్ ఫాన్ ఊడి కిందపడిపోయింది. అదృష్టవశాత్తూ హాల్లో ఎవరూ లేకపోబట్టి సరిపోయింది.."

"మావారు రేడియోలో కసరత్తు గురించి వివరించనారంభించగానే నిద్ర లేస్తారు."

"అంటే మీ వారికి వ్యాయామం అంటే అంత ఇష్టమన్నమాట"

"అబ్బే కాదు అదే సమయానికి ఎదురింటి అమ్మాయి డాబా మీద ఎక్సర్‌సైజులు ప్రారంభిస్తుంది.."

COMMENTS